సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం। 28। ఆగస్టు। 2024



అందని ఔషధం !

ఇల్లెందు, భద్రాచలం ఆస్పత్రుల్లో సరైన మందులు అందుబాటులో లేక జ్వర పీడితులు, డయాలసిస్ బాధితులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



'సీతారామ'లో మరో సొరంగం

ఉమ్మడి జిల్లాలో సాగు భూములకు గోదావరి నీరందించే సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32° / 24°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. ఉదయం ప్రారంభమయ్యే ఎండ తీవ్రత మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఇంకుడు గుంతలకు ఉద్యోగి పేరు

మృతి చెందిన ఎంపీఓ జ్ఞాపకంగా కలెక్టర్ నిర్ణయం



ఇంకుడు గుంత వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్ పాటిల్, పక్కన ఎంపీఓ సత్యనారాయణ (తెల్ల జుట్టు వ్యక్తి) (ఫైల్)

చుంచుపల్లి: ఇంకుడు గుంతల నిర్మాణంతో వర్షపు నీటిని ఒడిసి పట్టాలని.. తద్వారా భూగర్భ జలాల అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచనతో ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో రెండు, మూడు చొప్పున నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో చుంచుపల్లి మండలాన్ని ముందు వరుసలో నిలపడమే కాక విధుల్లో చురుగ్గా వ్యవహరించే చుంచుపల్లి ఎంపీఓ గుంటి సత్యనారాయణ(జీఎస్ఎన్) ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందారు. దీంతో ఆయన జ్ఞాపకార్థం ఇంకుడు గుంతలను ఇకపై జీఎస్ఎన్ సోప్ పిట్స్‌గా వ్యవహరించాలని కలెక్టర్ తాజాగా మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఎంపీఓ సేవలకు గుర్తింపుగా కలెక్టర్ తీసుకున్న నిర్ణయంపై ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని 100 మంది నిరుద్యోగ యువతకు పారామౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్, భారత్ మోటో కార్పొరేషన్ సంస్థలో ఉపాధి కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె. శ్రీరామ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే జామ్‌బేళాలో వెల్డర్, ఫిట్టర్, సూపర్‌వైజర్ ట్రైనీ, ఇంజనీర్లు, ఫీల్డ్ సేల్స్ కన్సల్టెంట్స్ పోస్టులు భర్తీ చేస్తారని, ఐటీఐ, డిప్లొమా మెకానికల్, బీటెక్ పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. జిల్లాలోని 18 – 35 సంవత్సరాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ అధికారులకు అవార్డులు



అవార్డులు అందుకున్న వారితో ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ ఏడాది జూన్, జూలైలో విధి నిర్వహణలో అంకితభావం, ప్రతిభ కనబర్చిన అధికారులకు టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అవార్డులను ప్రకటించగా, విద్యుత్ ఎస్ఈ జి. మహేందర్ మంగళవారం ప్రశంసపత్రాలు, మెమెంటోలు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో కొత్తగూడెం డీఈ పీఎస్‌వీఎస్ నందయ్య, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం టౌన్, ఇల్లెందు, పాల్వంచ ఏడీఈలు పి.ప్రభాకర్, పి.హేమచంద్ర బాబు, ఎ.కోటేశ్వరరావు, జె.లక్ష్మణ్, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం సౌత్, పాల్వంచ రూరల్, సుజాతనగర్ ఏఏఈలు ఎ.రఘురామయ్య, బి.నరేష్‌కుమార్, జి రవీందర్, జి కిషన్, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చండ్రుగొండ, గుండాల, కొత్తగూడెం నార్త్ ఏఈలు ఎస్‌సీహెచ్.సాయికిరణ్, జి.లక్ష్మీనరసింహారావు, ఎం.లక్ష్మీనరసింహారావు, ఎస్. రమేష్‌బాబు, ఎం. నర్మద ఉన్నారు.

ఇది కొత్తగూడెం పట్టణానికి ఆనుకుని విద్యానగర్‌లోని చింతల చెరువు. 14 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువును ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 కోట్లు కేటాయించింది. 40 శాతం మేర పనులు పూర్తయ్యాక.. మధ్యలో వదిలేశారు. ఈ చెరువు శిఖంతో పాటు, ఎఫ్‌టీఎల్ పరిధి భూమిలో గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. చెరువు చుట్టూ పదుల సంఖ్యలో అనుమతులు లేని బహుళ అంతస్తులు నిర్మితమయ్యాయి. ఐదెకరాల చెరువు స్థలం ఆక్రమణకు గురై చాలా రోజులవుతోంది. చెరువు విస్తీర్ణం తగ్గిపోవడంతో వరదల సమయంలో ఇళ్లలోకి భారీగా నీరు చేరి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి ఆక్రమణలు జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల ఉన్నాయి.



మన చెరువులూ ఆక్రమణల్లోనే..!

బఫర్ జోన్లలో వెలుస్తున్న బహుళ అంతస్తులు

- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు
- హైడ్రా తరహా వ్యవస్థ కావాలంటున్న జిల్లా వాసులు

చుంచుపల్లి: కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్టుగా చెరువులు, కుంటల విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోంది. జిల్లాలో సాగు, తాగునీటి చెరువులు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కొందరు ఆక్రమణదారులు చెరువుల్లో సగ భాగం సాగు చేస్తుండగా, మరికొందరు అనధికార నిర్మాణాలతో విలువైన చెరువు శిఖం భూములను కబ్జా చేస్తున్నారు. ఏళ్లుగా చెరువులకు చెందిన స్థలాల్లో అక్రమ లే-అవుట్లు చేసినా, అనుమతి లేని నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు.

జిల్లాలో ఆక్రమణకు గురైన కొన్ని చెరువులు...		
చెరువు	వాస్తవ విస్తీర్ణం	కబ్జా (ఎకరాల్లో)
సింగభూపాలెం	1,234	400
చింతల చెరువు, పాల్వంచ	94.33	10
జోగారావు చెరువు, పాల్వంచ	33.23	02
దొంతికుంట చెరువు, అశ్వారావుపేట	29	11
మేడికుంట చెరువు, పాల్వంచ	12.29	05
చింతల చెరువు, విద్యానగర్	14	05
రాతి చెరువు, పాల్వంచ	35.02	03
ఎర్రగుంట చెరువు, పాల్వంచ	30.20	02

బడా నేతలు, అధికారుల అండదండలతో కొందరు ఇష్టారాజ్యంగా చెరువుల భూములు ఆక్రమిస్తున్నారు. దీంతో రికార్డుల్లో ఉన్న విలువైన చెరువుల స్థలాలు క్షేత్రస్థాయిలో కనుమరుగయ్యాయి. హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణకు తీసుకొచ్చిన హైడ్రా వంటి వ్యవస్థను జిల్లాలో కూడా ఏర్పాటు చేయాలని, చెరువుల భూములను పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

అధికారుల సమన్వయలోపం..

జిల్లాలో 100 ఎకరాల కంటే ఎక్కువ ఆయకట్టు కలిగిన చెరువులు 167 ఉండగా, అంతకంటే తక్కువ ఆయకట్టు విస్తీర్ణం గల చెరువులు 2,110 ఉన్నాయి. ఇవి కబ్జాకు, ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులపై ఉంది. అయితే ఈ రెండు శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమార్కులకు వరంగా మారుతోంది. రెండు శాఖల అధికారులు సర్వే నిర్వహించి చెరువులను కాపాడడంలో విఫలమవుతున్నారని, దీంతో యథేచ్ఛగా కబ్జాకు గురవుతూ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన తర్వాత అన్ని ప్రాంతాల్లోనూ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న స్థలాల ధరలు ఆకాశాన్నంటాయి. ఇక్కడ ఇష్టారాజ్యంగా రియల్ ఎస్టేట్ దందా కొనసాగుతోంది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కబ్జా చేసేందుకు అక్రమార్కులు నిరంతరం దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, సుజాతనగర్, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట, చర్ల మండల కేంద్రాల్లో చెరువుల శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చెరువుల చుట్టుపక్కల స్థలాలను ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులు అడ్డగించి నోటీసులు జారీ చేసినా వాటిని బేఖాతరు చేస్తున్నారు. చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా సర్వే చేసి వాటి వాస్తవ హద్దులను రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు గుర్తించాలి. ఈ రెండు శాఖల పర్యవేక్షణ లేకపోవడంతో చారిత్రక చెరువులు అనేక ఏళ్లుగా కనుమరుగవుతున్నాయి.

చెరువులను పరిరక్షించాలి

జిల్లాలో చారిత్రక చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ భూములు అనేక ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదు. ప్రధానంగా కొత్తగూడెం పట్టణ పరిసర ప్రాంతాల్లో చెరువు శిఖం భూములనే కాకుండా, బఫర్ జోన్లను సైతం ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. ఈ విషయంలో అధి కారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ కూడా హైడ్రా లాంటి వ్యవస్థను అమల్లోకి తెచ్చి చెరువులను పరిరక్షించాలి.

–ఎర్రా కామేష్, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు

చెరువుల శిఖం భూములు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఎవరైనా భూములను ఆక్రమిస్తే సహించేది లేదు. జిల్లాలో ఎక్కడెక్కడ చెరువులు ఆక్రమణకు గురయ్యాయో ఇరిగేషన్ శాఖ అధికారుల ద్వారా వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటాం.

– గన్యా, కలెక్టరేట్ ఏఓ

నేడు, రేపు కార్పొరేట్ మెడికల్ బోర్డ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో బుధ, గురువారాల్లో కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. సంస్థలో పని చేస్తూ, ఉద్యోగ విరమణకు రెండేళ్ల గడువు ఉన్న వారికి వెసులుబాటు కల్పించి, వారి స్థానంలో వారసులకు (కొడుకు, అల్లుడు, కూతురు) ఉద్యోగావకాశం కల్పించేందుకు యాజమాన్యం రెండు రోజుల పాటు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసింది. మొదటి రోజున కార్మికుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు వైద్య పరీక్షలు నిర్వహించి పని చేయగలడా లేదా అని నిర్ధారిస్తారు. రెండోరోజున హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్య నిపుణుల ద్వారా మెడికల్ ఇన్‌వాలిడేషన్ (అనారోగ్యానికి సంబంధించిన) ఫలితాలు వెల్లడిస్తారు. ఇన్‌వాలిడేషన్ అయిన వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. మిగతా వారు యథావిధిగా విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సీఎండీ బలరామ్ పటిష్ట నిఘా ఏర్పాటుచేశారు. ఎవరైనా దళారులు తాము అన్‌ఫిట్ చేస్తామని నమ్మించే ప్రయత్నం చేస్తే వారి వివరాలను 94911 44104 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కాగా, గత మెడికల్ బోర్డ్‌లో 80 శాతం మంది ఇన్‌వాలిడేషన్ అయినట్లు సమాచారం. అయితే వారు నిజంగా అనారోగ్యానికి గురయ్యారా లేక పైరవీలు నడిచాయా అనేది తేల్చాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని, అన్‌ఫిట్ అయిన వారి వివరాలు నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని కార్మికులు అంటున్నారు.



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

విద్యావంతులతో దేశానికి మేలు

కొత్తగూడెంఅర్బన్: చదువుతో కలిగే లాభం దేశానికి మేలు చేస్తుందని, అందుకే ప్రతి ఒక్కరూ విద్యావంతులై ఉండాలని వ్యక్తిత్వ వికాస శిక్షణ నిపుణుడు జె.వెంకటేశ్వరబాబు అన్నారు. కొత్తగూడెంలోని మేదరబస్తీ ప్రభుత్వ పాఠశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కుటుంబ వ్యవస్థలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర కూడా అంతే కీలకమని అన్నారు. సమాజానికి ఆహారం అందించే రైతుల కష్టం, దేశం కోసం ప్రాణాలను సైతం అర్పించే సైనికుల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, క్లబ్ సెక్రటరీ గజ్జెల రాజేశ్వరరావు, కోశాధికారి నరేంద్రుల రుషికుమార్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో కృష్ణాష్టమి వేడుకలు



స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న రామాలయ అర్చకులు, వేద పండితులు

స్వామివారికి జోలలు.. లాలలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సీతాలక్ష్మణ సమేతుడైన స్వామివారిని కిట్టయ్యగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. ఆస్థాన పండితులు, విద్వాంసులు లాలలు జోలలు పాడుతుండగా ఊంజల్ సేవను వేడుకగా జరిపించారు. అదేవిధంగా ఉదయం స్వామి వారికి నిత్యకల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.

వైద్య శిబిరాలు నిర్వహించాలి

పీహెచ్‌సీ అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణాలు, గ్రామాల్లో ఎక్కువగా జ్వరాలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, బాధితులను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందించాలని అన్నారు. బరువు తక్కువున్న పిల్లలకు పోషకాహారం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పీహెచ్‌సీల పరిధిలో ఏమైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారులు బాలాజీ, మధువరణ్, రాకేష్, స్పందన, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యం నింపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం ఆనందఖని ఉన్నత పాఠశాలలో మంగళవారం అలింకో, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు ఇతరులతో పోల్చుకొని మానసిక కుంగుబాటుకు గురికాకుండా తల్లిదండ్రులు, ఐఈఆర్‌పీలు చూడాలన్నారు. వారిని ఉన్నత స్థితికి తెచ్చేలా ఐఈఆర్‌పీలు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం ఆరు భవిత కేంద్రాలకే శాశ్వత భవనాలు ఉన్నాయని, రానున్న రోజులలో అన్ని మండలాల్లో శాశ్వత భవనాలు నిర్మిస్తామని చెప్పారు. ఈ మేరకు విద్యాశాఖ నుంచి ప్రతిపాదనలు పంపాలన్నారు. డీఈఓ ఎం. వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ ఈ సంవత్సరం 384 మంది దివ్యాంగులను గుర్తించామని తెలిపారు. వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను ఎలా వినియోగించాలో ఐఈఆర్‌పీల ద్వారా తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.



దివ్యాంగుల శిబిరంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఆదివాసీ మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంటౌన్/అశ్వాపురం/మణుగూరు టౌన్/బూర్గంపాడు: ఆదివాసీ మహిళలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ముడి సరుకులను సైతం సొంతంగా కొనుగోలు చేసి.. ఆపై ఉత్పత్తులను మార్కెటింగ్ చేయగలిగితే ఆర్థికాభివృద్ధి సులువవుతుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని ఎంఎస్ఎంఈ యూనిట్‌లో ఆదివాసీ గిరిజన మహిళలు దమ్మక్క జాయింట్ లయబిలిటీ గ్రూప్ సబ్బులు, షాంపుల తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన ముడి పదార్థాలపై ఆరాతీశారు. ముడి పదార్థాలు తక్కువ ధరకు ఎక్కడ లభిస్తాయో తెలుసుకుని సభ్యులే కొనుగోలు చేయాలని, ఉత్పత్తులను గిరిజన విద్యాసంస్థలకు సరఫరా చేయాలని చెప్పారు. అంతేకాక బట్టల సబ్బుల తయారీపైనా దృష్టి సారించాలని సూచించారు. అనంతరం లక్ష్మీ గణపతి మహిళా ట్రైబల్ జాయింట్ లయబిలిటీ గ్రూప్ న్యూట్రిమిక్స్ డ్రై మిక్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించి గురుకుల పాఠశాలలకు ఇక్కడి నుంచి పౌష్టికాహారం పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులు భాస్కర్, దావీద్, ఉదయ్‌కుమార్, ప్రభాకర్‌రావు, రాంకుమార్, బేబీ రాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగంచేసుకోవాలి

నిరుద్యోగ యువత ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీఓ రాహుల్ అన్నారు. మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ఆదిదేవ డెకరేషన్ ఫొటోగ్రఫీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. డెకరేషన్, ఫొటోగ్రఫీతో జీవనోపాధి పొందుతున్న రాకేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమ్మక్క సారక్క మహిళా కందిపప్పు ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామాల్లో దొరికే కందిపప్పును సేకరించి ఈ కేంద్రం ద్వారా మార్కెటింగ్ చేయాలని సూచించారు. అనంతరం మణుగూరు మండలం సాంబాయిగూడెంలో ట్రైబల్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా చేపల పెంపకంతో జీవనాధారం పొందుతున్న గిరిజన రైతులతో మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా రైతులు చేపలు విక్రయించేందుకు బీటీపీఎస్ వద్ద మార్కెట్ సౌకర్యం కల్పించాలని, చిన్న చేప పిల్లల పెంపకానికి కుంటల ఏర్పాటుకు ఆర్థిక సాయం అందించాలని పీఓను కోరారు. అనంతరం పీఓ మోరంపల్లిబంజరలో పర్యటించి గిరిజన మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందిస్తామని చెప్పారు. ఎనిమిది మంది గిరిజన మహిళలు సొసైటీ ఏర్పాటు చేసుకుని కుట్టు శిక్షణ, డిజైనింగ్ నేర్చుకుని స్వశక్తితో జీవనోపాధి మెరుగుపరుచుకోవటం అభినందనీయమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ఎస్ఓ భాస్కర్, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, డీఎస్ఓ ప్రభాకర్‌రావు, ఏపీఎం నాగార్జున, రామ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, రాజేష్, స్వప్న, జ్యోతి, సావిత్రి, సుహాసిని పాల్గొన్నారు.



అశ్వాపురం : మహిళలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

జ్వరపీడితులు పోటెత్తారు..!

కిక్కిరిసిన ఇల్లెందు ఆస్పత్రి, జూలూరుపాడు పీహెచ్‌సీ



రక్త పరీక్ష కోసం బారులుదీరిన బాధితులు



ఇల్లెందు ఆసుపత్రిలో క్యూ కట్టిన జ్వరపీడితులు



జూలూరుపాడు పీహెచ్‌సీలో ఒక్కో బెడ్‌పై ఇద్దరికి సేవలందిస్తున్న దృశ్యం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం ఒక్కరోజే 650 మంది బాధితులు తరలివచ్చారు. దీంతో రిసెప్షన్ కౌంటర్ల వద్ద గంటల కొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్స్‌రే, రక్త పరీక్ష ల్యాబ్ వద్ద కూడా బారులుదీరారు. వీరిలో 28 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. అయితే ఇప్పటికే 81 మంది బాధితులు ఆస్పత్రిలో ఉండగా పడకలు సరిపోక ఇబ్బందులు తలెత్తాయి. ఎక్కువ మంది టైఫాయిడ్ జ్వరాలతో పాటు కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నారని వైద్యులు తెలిపారు. ఇక జూలూరుపాడు పీహెచ్‌సీలో సరైన సౌకర్యాలు లేక జ్వరపీడితులు ఇబ్బంది పడుతున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరిని పడుకోబెట్టి వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రక్త పరీక్షల వద్ద కూడా భారీగా క్యూ కట్టారు. పరీక్షలు ఆలస్యం అవుతుండడంతో పలువురు ల్యాబ్ టెక్నీషియన్లతో గొడవ పడ్డారు. ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపర్చాలని కోరుతున్నారు.

– ఇల్లెందు/జూలూరుపాడు

క్లుప్తంగా

మీ ఇంటికి మీ ఎమ్మెల్యే..



మహిళకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట: 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. 11 సీఎంఆర్ఎఫ్, 55 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తుమ్మ రాంబాబు, చిన్నంశెట్టి సత్యనారాయణ, చిప్పల బాబురెడ్డి, ఆళ్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

చుంచుపల్లి: మండలంలోని విద్యానగర్‌లో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బొమ్మిశెట్టి కిరణ్ కుమార్, ఇస్సంపల్లి వంశీ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షుడిగా అనంత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లుగా సంపత్ శ్రీనివాస్, జె.రవి, పి.లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బండారు నరేశ్, ఎండీ అజర్, ఎ.ఇందిర, కోశాధికారిగా తాఫిక్‌పాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉదయ్‌కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా మదార్ బాషా, స్పోర్ట్స్ సెక్రటరీగా విజయ్ రాథోడ్, కార్యాలయ కార్యదర్శిగా సాయి, ఈసీ మెంబర్లుగా టి.వెంకట్, సతీశ్, రాజశేఖర్, ఎస్‌కే రేష్మా బేగం ఎన్నికయ్యారు. టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి భార్గవ్ చైతన్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ కన్వీనర్ సుందిళ్ల బలరాం పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తు స్వీకరిస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్

పాల్వంచరూరల్: అర్హత ఉండి రుణ మాఫీ కాని రైతులు ఈనెల 30వ తేదీలోగా మండల వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సూచించారు. పాల్వంచలోని వ్యవసాయశాఖ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయన పలువురిని నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఇతర వివరాలు సమర్పించాలని తెలిపారు. నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో మరొకరి హతం



మావోయిస్టుల చేతిలో హతమైన వ్యక్తి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో ఇన్‌ఫార్మర్ల పేరిట మావోయిస్టులు ఇటీవల కాలంలో పలువురిని హతమార్చగా మరో గిరిజనుడిని సైతం హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మిర్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధి తిమ్మేనార్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని మంగళవారం హతం చేశారు. ఆయన ఇంటి ఆవరణలో పట్టపగలే గొడ్డళ్లు, కత్తులతో నరికి హతమార్చడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

దుమ్ముగూడెం : మండలంలోని మంగవాయి బాడువ గ్రామంలో పొడియం సురేష్‌కు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న రూ.85 వేలతో పాటు రెండు బంగారు ఉంగరాలు, చైన్, నిత్యావసర వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనలో రూ.3.50 లక్షల నష్టం వాటిల్లగా, బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,828

అందని ఔషధం!



ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు లేక ఖాళీగా కనిపిస్తున్న ర్యాక్

- మందులు అవసరమైన వారు బయట కొనుగోలు చేయాల్సిందే..
- బడ్జెట్ లేకపోవడం వల్లే కొరత అంటున్న ఆస్పత్రి వర్గాలు
- భద్రాచలం ఆస్పత్రిలో అడుగడుగునా సమస్యలే

భద్రాచలంఅర్బన్ : నాలుగు రాష్ట్రాల ప్రజలకు సేవలందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో అడుగడుగునా సమస్యలు తాండవిస్తున్నాయి. ఇక్కడ వైద్యం చేయించుకున్న వారికి మందులు అందుబాటులో ఉండవు. డాక్టర్ చీటీ రాస్తే బయటి దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి రావడంతో పేషెంట్లు, వారి బంధువులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బడ్జెట్ కొరత వల్లే మందులు సకాలంలో రావడం లేదని ఆస్పత్రి అధికారులు అంటున్నారు. 200 పడకల సామర్థ్యం గల ఈ ఆస్పత్రిలో నిత్యం 450 నుంచి 500 వరకు ఓపీ ఉంటుంది. మరి కొందరు ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. వీరందరికీ అవసరమైన వాటిలో కొన్ని రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగితావి పేషెంట్లు బయట కొనుగోలు చేయాల్సిందే.

కొరత ఉన్న మందులివే..

భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు ఉన్నారు. కానీ అత్యవసరమైన రాంటిడిన్, పెంటాప్రజోల్, పారాసిటమాల్, డైక్లోఫెనాక్, ఎరిత్రోమైసిన్, సెఫెక్జిమ్, సైనోకోబలామిన్ తదితర మందులు అందుబాటులో లేవు. రక్త పరీక్షలు, వివిధ రకాల జ్వరాలకు సంబంధించిన పరీక్షల నిర్వహణకు కిట్లు కూడా లేవు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు, జ్వరాల తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ సమయంలోనే మందుల కొరతతో బాధితులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఉచిత వైద్యమని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే బయట మందులు కొనుక్కోవడం ఏంటని పలువురు రోగులు ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఎమర్జెన్సీ మందుల కొరతపై జిల్లా అధికారులకు, డ్రగ్స్ కంట్రోల్ బోర్డుకు సమాచారం ఇచ్చాం. సర్జరీలు పెరుగుతుండగా, సరిపడా మందులు రావడం లేదు. దీంతో కొరత ఏర్పడుతోంది.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

ఈపీఓ.. స్టాక్ నిల్

- ఇల్లెందు ఆస్పత్రిలో 20 రోజులుగా ఇదే పరిస్థితి
- అల్లాడుతున్న డయాలసిస్ బాధితులు

ఇల్లెందు: డయాలసిస్ బాధితులకు ఉపయోగించే అతి ముఖ్యమైన ఎరిత్రోపోయిటిన్(ఈపీఓ) ఇంజెక్షన్లు లేక ఇల్లెందు ఆస్పత్రిలో పేషెంట్లు అల్లాడుతున్నారు. గత 20 రోజులుగా స్టాక్ లేదని వైద్యులు చెబుతున్నారు. డయాలసిస్ చేసే క్రమంలో రెండు దఫాలకు ఒకసారి ఈ ఇంజెక్షన్ వేస్తారు. ఈ ఔషధం రక్తం గడ్డకట్టకుండా, ఉత్పత్తిని ప్రేరేపించేలా ఉపయోగపడుతుంది. అలాంటి అత్యంత కీలకమైన ఇంజెక్షన్ల సరఫరాను ప్రభుత్వం నిలిపేసింది. అయితే ఖమ్మం వంటి పట్టణాల్లో ప్రైవేట్ మెడికల్ షాపుల్లో ఇది లభిస్తున్నా.. ఇల్లెందులో మాత్రం ప్రైవేట్ లోనూ అందుబాటులో లేవు. ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో 42 మంది డయాలసిస్ సేవలు పొందుతున్నారు. వీరిలో కొందరు వారానికి రెండు దఫాలు డయాలసిస్‌కు వస్తున్నారు. పడకలు సరిపోక మరో 15 మంది వెయిటింగ్‌లో ఉన్నారు. ఈపీఓ ఇంజెక్షన్ బయట కొనుగోలు చేయాలంటే ఒక్కోటి రూ.650 నుంచి రూ.750 వరకు ధర ఉందని, ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేకుంటే తామెలా డయాలసిస్ చేయించుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మందు ఖమ్మంలోని సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి అన్ని డయాలసిస్ సెంటర్లకు పంపించాల్సి ఉండగా.. అక్కడే నిల్వ లేకపోవడంతో సరఫరా నిలిచిపోయింది. ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిధులున్నా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా అయినా కొనుగోలు చేసేవారు. కానీ ఇల్లెందు ఆస్పత్రిలో నిధుల కొరత కారణంగా ఈ మందును కొనుగోలు చేయలేకపోతున్నారు.



ఇల్లెందు ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్

స్టాక్ లేదంటున్నారు..



20 రోజులుగా ఈపీఓ ఇంజెక్షన్ స్టాక్ లేదంటున్నారు. దీంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. బయట కొనుగోలు చేద్దామన్నా ఇల్లెందులో అందుబాటులో లేవు. డయాసిస్ పేషెంట్ల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– కటకం దయాకర్, డయాలసిస్ బాధితుడు

స్టాక్ కొరత..



డయాలసిస్ చేసే క్రమంలో రోగులకు ఇచ్చే ఈపీఓ ఇంజెక్షన్ స్టాక్ కొరత ఏర్పడింది. ఈ విషయం ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరఫరా లేదు. వస్తే పేషెంట్లకు అందిస్తాం.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్ఎస్

ఉద్యోగ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంరూరల్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఖమ్మం, భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 108 వాహనాల్లో డ్రైవర్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, అభ్యర్థుల ఎత్తు 54 అంగుళాలు, వయసు 22 – 35 ఏళ్ల మధ్య ఉండాలని, ఎల్ఎంవీ బ్యాడ్జ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్ : భూవివాదం ఘటనలో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాలిలా.. పాల్వంచ కేటీపీఎస్‌లో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బోడా బాసుకు పాత సూరారంలో మూడున్నర గుంటల భూమి ఉంది. ఇంటి స్థలానికి చెందిన డాక్యుమెంట్‌ను తన భార్య భవాని, డాక్యుమెంట్ రైటర్ ఎలమందారెడ్డి ఫోర్జరీ చేశారంటూ బాసు కోర్టుకు వెళ్లగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు.

దాడి ఘటనలో...

ఇల్లెందు: కారు ఢీ కొట్టిన వీడియోను అందరికీ చూపిస్తున్నావంటూ ఇల్లెందు జేకే కాలనీకి చెందిన కొర్రి స్వామి అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు దాడి చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్ మీరా పటాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో అనిత, సృజన్, అభిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచరూరల్ : పేకాట స్థావరంపై దాడిచేసిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని తోగ్గూడెం మిషన్ భగీరథ గ్రిడ్ సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సురేశ్ మంగళవారం దాడి చేశారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, వారి నుంచి రూ.2వేల నగదు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సీతారామ ప్రాజెక్ట్‌లో మరో సొరంగం

- ప్యాకేజీ – 8లో నిర్మాణానికి ప్రతిపాదనలు
- ప్యాకేజీ – 13లో వ్యయం తగ్గేలా అలైన్‌మెంట్

ఖమ్మంఅర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలో సాగు భూములకు గోదావరి జలాలను అందించేందుకు ప్రతిపాదించిన సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే కూసుమంచి మండలంలో నీటి తరలింపునకు సొరంగ మార్గం నిర్మిస్తుండగా.. మరోచోట కూడా ఇదే తరహా నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రాజెక్టు ప్యాకేజీ – 8లో జల వనరుల శాఖ కొత్తగూడెం డివిజన్ పరిధి జూలూరుపాడు మండలం వినోబానగర్ సమీపాన ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలుపెడతారని సమాచారం.

రూ.620 కోట్లు కాదు రూ.350కోట్లే...

ప్రాజెక్టులో మరో కీలకమైన మార్పు చోటు చేసుకోనుంది. ప్యాకేజీ – 13లో నిర్మాణాలకు గత ప్రభుత్వ హయాంలో రూ.620కోట్లు కేటాయించి టెండర్లు పిలిచారు. అయితే, వివిధ కారణాలతో టెండర్ల దశ దాటలేదు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఈ ప్యాకేజీ పనుల ప్రతిపాదనలను పరిశీలిస్తే చాలాచోట్ల భారీ స్థాయిలో కట్టడాలు అవసరమని గుర్తించారు. అందుకోసమే రూ.620 కోట్లు వ్యయమవుతుందని భావించగా రీ డిజైన్ చేయించారు. కొత్త ప్రతిపాదనల ఆధారంగా ఇదే ప్యాకేజీలో పనులు పూర్తిచేయడానికి రూ.350 కోట్లు సరిపోతాయని అంచనాకు వచ్చారు. అంతేకాక భూమి కూడా తక్కువగా అవసరమవుతుందనే భావన వ్యక్తమైంది. ఈ నేపథ్యాన అటవీ శాఖ నుంచి సేకరించే భూమి మరో చోట కేటాయించడమే కాక నూతన అలైన్‌మెంట్ సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇదంతా వారం, పది రోజుల్లో పూర్తిచేసి టెండర్లు పిలిచే అవకాశముందని సమాచారం.

బీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం



భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్

మణుగూరు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం చిక్కుడుగుంట సమీపాన ఉన్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్) రెండో యూనిట్‌లో మంగళవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. సాంకేతిక లోపం కారణంగా 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్న నేతృత్వాన సాంకేతిక లోపాన్ని సవరించేందుకు మరమ్మతు పనులు ప్రారంభించారు.

పట్టపగలే తాళం పగలగొట్టి చోరీ

కారేపల్లి: పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి ప్రవేశించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని విశ్వనాథపల్లికి చెందిన రైతు దమ్మాలపాటి రాంబాబు మంగళవారం ఉదయం తన భార్యతో కలిసి చేను వద్దకు వెళ్లాడు. ఈమేరకు మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళంతో పాటు బీరువా తాళాలు పగలకొట్టి ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.28వేల నగదు ఎత్తుకెళ్లారు. చేను నుంచి సాయంత్రం వచ్చాక చోరీ జరిగినట్లు గుర్తించిన రైతులు ఇచ్చిన సమాచారంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ఎన్.రాజారాం పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

నల్ల దుస్తుల్లో వచ్చి చోరీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని బుగ్గపాడులోని పలు కూల్‌డ్రింక్ షాపులు, ఓ కిరాణం షాప్‌లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి వేళ వచ్చిన వారు ఎవరికీ కనబడొద్దనే భావనతో నల్లదుస్తులు ధరించి ఉండగా.. అలజడికి బయటకు వచ్చిన స్థానికులు గుర్తించి కేకలు వేశారు. ఇంతలోనే నిందితులు కూల్‌డ్రింక్ సీసాలు, బెల్ట్ షాపుల్లోని మద్యం సీసాలు తీసుకుని పరారవుతుండగా వెంబడించడంతో పరుగులు తీస్తూనే నల్ల దుస్తులను విప్పేసి కనరాకుండా పోయారు. దీంతో చేసేదేం లేక గ్రామస్తులు వెనుదిరిగారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. కాగా, రాత్రి వేళ ఎవరూ గుర్తించరనే భావనతో నల్లబట్టలతో వారు వచ్చారని తెలుస్తుండగా, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

45 కేజీల గంజాయి స్వాధీనం

కొత్తగూడెంరూరల్/భద్రాచలంటౌన్ : గుట్టుచప్పుడు కాకుండా కారులో తరలిస్తున్న ఎండు గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా.. సీలేరు నుంచి హైదరాబాద్‌కు కారులో రవాణా చేస్తున్న 45 కేజీల గంజాయి పట్టుబడింది. అక్రమంగా రవాణా చేస్తున్న సంగారెడ్డికి చెందిన రాథోడ్ సతీష్, భువనగిరి జిల్లా ములకలపల్లికి చెందిన బానోతు వీరూను అదుపులోకి తీసుకుని, గంజాయితో పాటు కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

భద్రాచలంలో 4.11 కిలోలు..

భద్రాచలం ఆర్టీఓ కార్యాలయం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో ఆక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో గుంటూరుకు చెందిన యూసఫ్, పల్లెబోయిన శ్రీహరి, విజయవాడకు చెందిన సదా వెంకట దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.



లోతువాగు వద్ద పట్టుబడిన నిందితులు, గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఆన్‌లైన్ గేమ్ పేరుతో రూ.50 వేలు స్వాహా

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెంకు చెందిన నరుకుల్లా అమరేంద్ర తన వాట్సప్ నంబర్‌కు వచ్చిన మెసేజ్‌ను నమ్మి రూ.50 వేలు పోగొట్టుకున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్ ఆడితే విలువైన బహుమతులు వస్తాయని, అందుకోసం తొలుత రూ.50 వేలు డిపాజిట్ చేయాలని మెసేజ్ వచ్చింది. అది నమ్మిన అమరేంద్ర నగదు పంపించి, ఆన్‌లైన్‌లో గేమ్ ఆడటానికి ప్రయత్నించగా ఫలితం కనిపించలేదు. ఆతర్వాత వాట్సప్ ద్వారా కాల్ చేస్తే ఇంకా డబ్బులు చెల్లించాలని సూచించారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన అమరేంద్ర చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

48 గంటల్లోనే నిందితుడి అరెస్ట్, సొత్తు రికవరీ

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని గ్రామపంచాయతీ సమీపాన నివాసముండే జక్కుల భద్రమ్మ ఇంట్లో చోరీ జరగగా 48గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితుడిని గుర్తించి సొత్తు రికవరీ చేశారు. ఇంట్లో భద్రమ్మ లేని విషయాన్ని గుర్తించిన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకలపల్లికి చెందిన పాత ఇనుము వ్యాపారం చేసే నెర్సుల నరేష్ ఈనెల 25న(ఆదివారం) మధ్యాహ్నం చోరీ చేశాడు. ఈమేరకు ఫిర్యాదు అందుకున్న ఎస్సై కూచిపూడి జగదీశ్ ఆధ్వర్యాన దర్యాప్తు చేపట్టగా మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని శ్రీ సిటీ సమీపాన నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి నుంచి బంగారు దిద్దులు, రెండు జతల పట్టీలను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో ఎస్సై, సిబ్బంది

ఇంటిపై నుంచి జారిపడి తీవ్ర గాయాలు



గాయపడిన వినోద్

కరకగూడెం: ఇంటిపై నుంచి జారిపడిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. భట్టుపల్లి గ్రామానికి చెందిన కుంచం వినోద్ అదే గ్రామానికి చెందిన లక్క రాము ఇంటి మొదటి అంతస్తులో మంగళవారం డ్రిల్లింగ్ మిషన్‌తో మెట్లు కూలగొడుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై నోటి నుంచి రక్తస్రావం కావడంతో పాటు రెండు పళ్లు ఊడిపోయాయి. కుటుంబసభ్యులు వినోద్‌ను 108 ద్వారా కరకగూడెం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ములకలపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని, దమ్మపేటకు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని కమలాపురం మీదుగా దమ్మపేటకు రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు కమలాపురం శివారులో దాడులు నిర్వహించి, ఆటోలో తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్...

పాల్వంచ: మొర్రేడు వాడు నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఇందిరా కాలనీ వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ డ్రైవర్ బాలకృష్ణ, యజమాని సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

పశువులు తరలిస్తున్న వ్యాన్ అడ్డగింత

అశ్వారావుపేట: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యాన్‌ను అశ్వారావుపేట పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన రామావత్ శ్రీను, మొల్లి బాజ్జి ఏపీలోని జగ్గంపేట నుంచి హైదరాబాద్ కబేళాకు 35 పశువులను తరలిస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని, పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

సారా తయారీదారుడికి రూ.50 వేలు జరిమానా

అశ్వారావుపేట: నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని మంగళవారం తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రాజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పాయం కామేశ్వరరావు గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడ్డాడు. మళ్లీ సారా తయారు చేస్తూ దొరకడంతో బైండోవర్ చేయగా రూ.50వేలు జరిమానా విధించినట్లు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాల్వంచ: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని శేఖరం బంజరలో కూలీ పనులు చేసుకుంటూ జీవించే బొడ్డు రాందాస్(47) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మృతి చెందాడు. కాగా, తన తండ్రి మృతిపై అనుమానం ఉందంటూ రాందాస్ కూతురు వాంకుడోత్ ఉమ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- రెండు రోజుల తర్వాత గుర్తించిన స్థానికులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్‌కు చెందిన ఎం.బ్రహ్మచారి(45) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కొన్నాళ్లుగా మద్యానికి బానిస కావడంతో ఇద్దరు పిల్లలతో సహా భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన బ్రహ్మచారి ఈనెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకోగా బయటకు విషయం తెలియలేదు. ఇంతలో మంగళవారం ఇంటి నుండి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆయన మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

పంచాయతీ పంప్ ఆపరేటర్..



కోటేశ్వరరావు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు జీపీలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రాచబంటి కోటేశ్వరరావు (44) కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత శనివారం ఆయన భార్యతో ఘర్షణ పడి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న కలుపు మందు తాగి పడిపోయాడు. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆయన సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిప్పంటించుకుని ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణం..



ఇమానియేల్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని హనుమాన్ బస్తీకి చెందిన ఇమ్మానియేల్(54) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండగా.. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. 90 శాతం మేర శరీరం కాలిపోగా గమనించిన స్థానికులు కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇమ్మానియేల్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.